సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



పెనుగొండలో భారీ చోరీ

ఇంటికి తాళం వేసి షిర్డీ వెళ్తే.. దొంగలు ఉన్నదంతా దోచేశారు. 49 కాసుల **బంగారు ఆభరణాలు అపహరించారు.**

8లో ▸



పౌల్ట్రీకి కోలుకోలేని దెబ్బ

బర్డ్‌ఫ్లూ వైరస్‌తో రాష్ట్రవ్యాప్తంగా పౌల్ట్రీ రంగం కుదేలైంది. దాదాపు రాష్ట్రంలో రూ.100 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.

8లో ▸



కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగి పరమేశ్వరరావు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.

8లో ▸

న్యూస్‌రీల్

ఎన్నికల పరిశీలకులుగా శ్రీధర్



శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు పరిశీలకులుగా నియమించిన సీహెచ్ శ్రీధర్ శుక్రవారం ఏలూరు చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు

ఎన్నికల నిర్వహణలో భాగంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్ మీడియేటరీ, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ సెంటర్‌ల వివరాలను కలెక్టర్ వెల్లడించారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు: పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలో ఆర్డీఓ కార్యాలయాలు.

రిసెప్షన్ సెంటర్ కం స్ట్రాంగ్ రూమ్‌లు: పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం కలెక్టరేట్. అనంతరం ఆయా జిల్లాల్లో ఇంటర్ మీడియేటరీ స్ట్రాంగ్ రూంలకు చేరిన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని ఏలూరు జిల్లా వట్లూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు తరలిస్తారు. మార్చి 3న కౌంటింగ్ నిర్వహిస్తారు.

శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు

భీమవరం(ప్రకాశం చౌక్): మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 24, 25 తేదీల్లో భీమవరం బస్టాండ్ నుంచి శ్రీశైలం క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ ఉందని, టికెట్ ధర పెద్దలకు రూ.730, పిల్లలకు రూ.370 అన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 7382924754, 08816 239100 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


ప్రశాంతంగా టీసీసీ పరీక్షలు

భీమవరం: స్థానిక ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలకు 48 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. ఉదయం డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 70 మందికి 51 మంది, హయ్యర్ పరీక్షకు 29 మందికి 24 మంది, మధ్యాహ్నం డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 70 మందికి 51 మంది, హయ్యర్ పరీక్షకు 29 మందికి 24 మంది హాజరయ్యారని చెప్పారు.

ఆధార్ నమోదు వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పిల్లలకు నూతన ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాన్ని పొందేందుకు దరఖాస్తు చేయించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతను సమావేశం నిర్వహించారు.

దొంగ నోట్లకు చైనా నుంచి కాగితం




వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నరసాపురం: దొంగ నోట్ల తయారీకి చైనా నుంచి పేపర్లు కొనుగోలు చేసిన విషయాన్ని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ గుర్తించి అప్రమత్తమవడంతో ఓ యువకుడి బండారం బట్టబయలైంది. సద రు యువకుడిని అరెస్ట్ చేసి కొన్ని కాగితాలు, ప్రింటర్, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నరసాపురం పట్టణ సీఐ బి.యాదగిరి శుక్రవారం వివరాలు వెల్లడించారు. నరసాపురంలోని రాయిపేట సన్‌షైన్ స్కూల్ ప్రాంతంలో నివాసం ఉంటున్న మహ్మద్ ఇస్మాయిల్ ఖాన్ కొద్దిరోజుల క్రితం లైసెన్స్‌దారులకు మాత్రమే విక్రయించే సెక్యూరిటీ పేపర్లు ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టాడు. చైనా కంపెనీకి చెందిన 96 పేపర్లు ఇంటికి చేరాయి. డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (విజయవాడ) సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి సామి నాగభూషణం దీనిపై ఆరా తీశారు. లైసెన్స్ లేని ఇస్మాయిల్ ఖాన్ ఈ పేపర్లు ఎందుకు కొనుగోలు చేశారని దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో నాగభూషణం సిబ్బందితో కలిసి ఇస్మాయిల్ ఖాన్ ఇంటిపై దాడి చేయగా 96 పేపర్లలో కొన్ని చింపివేసి ఉండటం, ప్రింటర్ కూ డా ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు దర్యాప్తు చేసి యువకుడిని అదుపులోకి తీ సుకున్నామని సీఐ చెప్పారు. కలర్ ప్రింటర్ సా యంతో రూ.500 నకిలీ నోట్ల తయారీకి ప్రయత్నించానని, అయితే అవి నాణ్యతగా రాకపోవడంతో చింపివేశానని ఇస్మాయిల్ ఖాన్ విచారణలో అంగీకరించాడన్నారు. చైనా పేపర్ల విలువ రూ.8 వేలు అని తెలిపారు. చింపిన నోట్లు, మిగిలిన పేపర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సైలు జయలక్ష్మి, ముత్యాలరావు ఉన్నారు.

అన్నదాతలకు దగా

చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎంగా కూటమి పాలన చేపట్టి తొమ్మిది నెలలైంది. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ పూర్తి కాగా మరో రెండు నెలల్లో రబీ పూర్తవుతుంది. 'అన్నదాత సుఖీభవ' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నేతలు ఇప్పుడు ఊసెత్తడం లేదు. అన్నదాతలను ఆదుకోకపోగా కొండంత అండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్‌బీకే వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి ఎకరాకు రూ.615 చొప్పున ప్రీమియం భారాన్ని రైతులపై మోపారు.



కర్షకులపై కూటమి పగ

- 24న పీఎం కిసాన్ విడుదల చేయనున్న కేంద్రం
- అన్నదాత సుఖీభవ పథకం ఊసెత్తని రాష్ట్ర ప్రభుత్వం
- ఎన్నికల హామీలను విస్మరించిన సీఎం చంద్రబాబు
- వైపరీత్యాలు, దళారుల దోపిడీతో రైతులు కుదేలు
- గత ప్రభుత్వంలో జిల్లాలో రూ.796.49 కోట్ల లబ్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో రైతు భరోసా సాయం

సంవత్సరం	రైతులు	సాయం రూ.కోట్లలో
2019-20	1,09,302	147.56
2020-21	1,24,664	168.30
2021-22	1,17,791	159.02
2022-23	1,13,597	153.36
2023-24	1,24,645	168.17

అన్నం పెట్టే రైతన్నను అన్నివిధాలా ఆదుకుంటాం. మన ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తాం. పంట పెట్టుబడుల కోసం 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందిస్తాం.

జిల్లాలోని ఎన్నికల సభల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీలు

సాక్షి, భీమవరం: గతేడాది జిల్లాలోని 2.05 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టగా భారీ వర్షాలు, ఫెంగల్ తుపాను, తగ్గిన దిగుబడులు, తేమశాతం పేరుతో దళారులు, మిల్లర్ల దోపిడీ, ప్రభుత్వ సాయం అందక రైతులు నష్టపోయారు. దీంతో రబీ సీజన్‌లో పెట్టుబడులకు సొమ్ములు లేక సాగు ఆలస్యమైంది. జిల్లాలో 2.2 లక్షల ఎకరాల్లో డిసెంబర్ నెలాఖరుకు నాట్లు పూర్తిచేయాల్సి ఉండగా ఈ నెల రెండో వారం వరకూ నాట్లు పడ్డాయి.

అన్నదాత సుఖీభవ మాటెత్తని కూటమి

ఏటా రూ.20 వేల చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామన్న ఎన్నికల హామీని పాలకులు విస్మరించారు. ఇప్పటికే పీఎం కిసాన్ పథకం కింద రెండు విడతల్లో రైతులకు రూ.4 వేలు సాయం అందించిన కేంద్ర ప్రభుత్వం చివరి విడతగా (2024-25) ఈనెల 24న మరో రూ.2 వేలను ఖాతాలకు జమచేయనుంది. అయినా అన్నదాత సుఖీభవ పథకంపై కూటమి ప్రభుత్వం నోరుమెదపడం లేదు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ రూ.1.45 లక్షల కోట్లు అప్పులు చేసినా రైతులకు ఒక్క పైసా విదల్చలేదు.

గత ప్రభుత్వంలో సాగుకు ముందే..

మాజీ సీఎం జగన్ హయాంలో ప్రతి సీజన్‌లో సాగు ప్రారంభానికి ముందే వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద సాయం అందించారు. ఏడాదికి కేంద్ర సాయం రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 జతచేసి మొత్తంగా రూ.13,500 లబ్ధి అందించింది. తొలివిడతగా మే నెలలో రూ.7,500, ఖరీఫ్ చివరిలో రెండో విడతగా రూ.4 వేలు, రబీ ప్రారంభ సమయంలో మూడో విడతగా రూ.2 వేలు రైతులకు అందేది. ఇలా గత ఐదేళ్లలో జిల్లాలో రైతులకు రూ.796.49 కోట్ల లబ్ధి చేకూర్చారు.

మాటలు నమ్మి నష్టపోయాం



నేను మూడెకరాలు సాగు చేస్తున్నా. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తానన్న రూ.20 వేలు ఇప్పటికీ ఇవ్వలేదు. మరోపక్క పంటల బీమా భారం మోపారు. కూటమి ప్రభుత్వ పెద్దల మాటల నమ్మి రైతులంతా అన్నివిధాలా నష్టపోయారు.

– గుబ్బల మోహనరావు, రైతు, చామకూరిపాలెం

పెట్టుబడులకు ఇబ్బంది



ఖరీఫ్ సీజన్ వరి సాగు చేసి వర్షాల వల్ల నష్టపోయాం. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆదుకునేది. ప్రస్తుతం రబీ సీజన్‌లో వరి సాగు చేస్తున్నా ప్రభుత్వం చేయూత ఇవ్వకపోవడంతో పెట్టుబడులకు చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– జి.వెంకన్న, రైతు, గరగపర్రు

అప్పులు చేస్తున్నాం



నేను రెండెకరాలు సాగు చేస్తున్నా. పెట్టుబడి సాయం అందక సాగు ఖర్చులకు అప్పులు చేస్తూ వడ్డీలు కడుతున్నా. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాగుకు ముందే సాయం అందించేవారు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైంది.

– కుడిపూడి సత్యనారాయణ, రైతు, ఇరగవరం

సాగు ఖర్చులు పెరిగాయి



అధికారులు వివరాలు నమోదు చేయడమే తప్ప ఎలాంటి సాయం అందలేదు. దాళ్వాలో ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగడంతో సాగు ఖర్చు పెరిగింది. కూటమి ప్రభుత్వం ఎలుకల మందు తప్ప ఏమీ ఇవ్వలేదు. ఆ మందు కూడా రైతులకు ఉపయోగకరంగా లేదు.

– తేతలి ప్రసాద్ రెడ్డి, రైతు, పెనుమంట్ర

హామీలను మరిచారు



కూటమి ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా సాయం అందించేవారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులకు రైతు భరోసా హామీని నెరవేర్చాలి.

– బీవీ చలం, రైతు, వేడంగిపాలెం

రైతులపై చిన్నచూపు



అసలే అప్పుల్లో కూరుకుపోయిన రైతుకు పెట్టుబడి సాయం అందించడంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి రాయితీ ఇవ్వకపోగా ఎరువుల ధరలు పెంచి నిండా మోసం చేసింది. రైతులపై చిన్నచూపు చేసే ధోరణి వీడాలి.

– దేవరశెట్టి రాంబాబు, కౌలు రైతు, బి.కొండేపాడు

కూటమి కుయుక్తులు

ఓటర్లకు ప్రలోభాల వల

- ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లను కలిసి టీడీపీ గ్రూపుల్లో ఫొటోలు
- ఫోన్ కాల్స్, సర్వేలతో వెంటాడుతున్న వైనం
- ప్రతి 30 మంది ఓటర్లకూ ఓ టీడీపీ కార్యకర్త
- ఓటుకు నోటు లేదా గిఫ్టు!
- 25తో ముగియనున్న ప్రచారం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎన్నికల బరిలో కూటమి పార్టీ కుయుక్తులకు తెరలేపింది. భవిష్యత్‌లో పథకాలు అందాలంటే ఓటు వేయాల్సిందేనంటూ కార్యకర్తల ద్వారా ఓటర్లను పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతోంది. మరోవైపు ఓటుకు నోటు లేదా గిఫ్టు ఇస్తామంటూ ఓటర్లను ప్రలోభపెడుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కీలక దశకు చేరుకుంది. ఈనెల 25న సాయంత్రంతో ప్రచారం ముగియనుండటంతో కూటమి ఎమ్మెల్యేలు ఇంటింటి బాట పడుతున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరుగనుంది. కూటమి పార్టీ నుంచి తూర్పుగోదావరి జిల్లా టీడీపీ నేత పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ నుంచి రిటైర్డ్ టీచర్ దిడ్ల వీరరాఘవులుతో పాటు మరో 33 మంది స్వతంత్రులు పోటీ చేస్తున్నారు.

కూటమిపై తీవ్ర అసంతృప్తి

కూటమి ఎమ్మెల్యేలు విస్తృత ప్రచారానికి తెరతీశారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావడం, నిరుద్యోగ భృతి మొదలు డీఎస్సీ వరకు యువతకు ఇచ్చిన ఒక్క హామీ కూడా ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో యువతలో తీవ్ర అసంతృప్తి రేగింది. దీంతో పాటు ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా విపరీతంగా ఎన్నికల హామీలు గుప్పించారు. దీంతో ఉపాధ్యాయ, ఉద్యోగ ఓటర్లతో పాటు పట్టభద్రుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతుందనే సమాచారంతో టీడీపీ ఎమ్మెల్యేలు విస్తృత స్థాయిలో ప్రచార పర్వం నిర్వహించాలని పార్టీ అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. మొత్తం వ్యవహారాన్ని రోజూ రాష్ట్ర కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేలు ప్రచారంలో అత్యుత్సాహంతో వ్యవహరిస్తున్నారు. ప్రతి 30 మంది ఓటర్లకు ఒక టీడీపీ కార్యకర్తను ఏర్పాటు చేసి ఓటర్లను కలిసి వారితో ఫొటో దిగి గ్రూపులో అప్‌లోడ్ చేయిస్తున్నారు. ఇంకోవైపు ఎమ్మెల్యే అభ్యర్థులు అసోసియేషన్ల వారీగా ఓటు వేయాలని అభ్యర్థించడంతో పాటు తమదైన శైలిలో హెచ్చరికలు చేస్తున్నారు. పనులు కావాలన్నా, ప్రభుత్వంతో ఏదైనా మాట్లాడాలన్న కూటమి అభ్యర్థిని గెలిపించాలంటూ సచివాలయ ఉద్యోగులను మొదలు టీచర్ల వరకు పరోక్షంగా వార్నింగ్‌లు ఇస్తున్నారు. ఇంకోవైపు అడ్డగోలుగా ప్రభుత్వ పాఠశాలలు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారిక సమావేశాలు ఏర్పాటుచేసి మరీ ఓట్లను అభ్యర్థిస్తూ ఎమ్మెల్యేలు ప్రచారం చేస్తున్నారు.

ఓటుకు నోటు!

మరోవైపు నియోజకవర్గంలో రోజూ తిరుగుతున్న కార్యకర్తలకు మనిషికి రూ.వెయ్యి చొప్పున ఇస్తున్నారు. ఇలా దెందులూరు మండలంలో 70 మందికి సొమ్ములు అందజేసి ఓట్ల బాధ్యతలను అప్పగించారు. ఇంకోవైపు ఓటుకు నోటు లేదా గిఫ్టు తప్పనిసరిగా ఇస్తామని చెప్పి పూర్తి వివరాలు తీసుకుని టీడీపీ నేతలే ఎన్నికల అధికారులకు బదులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. ఇంకోవైపు ఐవీఆర్ సర్వేలు, అభ్యర్థులను గెలిపించాలంటూ ఫోన్‌కాల్స్‌తో ఓటర్లకు చిర్రెత్తేలా చేయడంతో పాటు సోషల్ మీడియాలో విస్తృత స్థాయిలో ప్రచారానికి తెరతీశారు.

పవన్ కల్యాణ్ ఇలాంటి సైకోలను తయారుచేసి పంపించాడా?

- జనసేన ఎమ్మెల్యేపై టీడీపీ కార్యకర్త ఆగ్రహం
- సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న సెల్ఫీ వీడియో

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై అసమ్మతి గళాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎమ్మెల్యే, జనసేన నాయకుల తీరుపై ఓ టీడీపీ కార్యకర్త ఆవేదనతో శు క్రవారం ఒక సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం కలకలం రేపింది. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ప్రభుత్వం ఇసుక ఫ్రీ అని ప్రకటించిందని, ఇక్కడ మాత్రం జనసేన మండల ప్రెసిడెంట్ ట్రాక్టర్‌కు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నా రని ఆ సెల్ఫీలో ఆయన విమర్శించారు. పవన్ కల్యాణ్ ఇలాంటి సైకో ఎమ్మెల్యేను తయారు చేసి ఇక్కడికి పంపించాడా అంటూ ప్రశ్నించా రు. ప్రతి కార్యకర్త కూడా ఇటువంటి సెల్ఫీ వీడియోలు పెట్టి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు చేరేలా చూడాలని చెప్పారు. బోర్ వేసుకోవాలన్నా, వృద్ధాప్య పింఛన్ కావాలన్నా, బెల్ట్ షాపు పెట్టుకోవాలన్నా లంచాలు వసూలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యే కంటే గత ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఎంతో బెటర్ అంటూ చెప్పారు. ఆఖరికి పొలంలో బోరు వేసుకోవాలన్నా రూ.25 వేలు లంచంగా అడుగుతున్నారంటూ తెలిపారు. బెల్ట్ షాపు పెట్టుకోవాలంటే రూ.1.50 లక్షలు, వీఆర్వోల బదిలీకి రూ.10 వేల నుంచి రూ.లక్ష, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ భూములు మార్చుకుంటే రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నారంటూ వివరించారు. రాత్రి సమయానికి ఆ కార్యకర్త మరో వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోను తాను గతంలో మనస్పర్థలు ఉన్నప్పుడు చేశానని, దానిని కొంతమంది కా వాలనే సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని, అటువంటి వారిపై కేసు పెడతానంటూ ఆ కార్యకర్త అందులో పేర్కొనడం గమనార్హం.

మావుళ్లమ్మ స్వర్ణమయం బహుదూరం!

- ఆభరణాల తయారీపై అధికారుల నిర్లక్ష్యం
- 100 కిలోల బంగారం సేకరణ లక్ష్యం
- ఇప్పటివరకూ 74 కిలోల సేకరణ
- 51 కిలోలతో ఆభరణాల తయారీ
- లాకర్లలో 23 కిలోల పసిడి



మావుళ్లమ్మ అమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): సిరులతల్లి.. కల్పవల్లి.. భక్తుల పాలిట కొంగు బంగారం.. భీమవరం మావుళ్లమ్మవారిని స్వర్ణమయంలో చూడాలన్న భక్తుల కోరిక నెరవేరడం లేదు. దాదాపు 20 ఏళ్ల క్రితం 100 కిలోల బంగారం సేకరణ లక్ష్యంగా విరాళాలు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటివరకూ 74 కిలోల బంగారం సేకరించగా.. 51 కిలోలతో ఆభరణాలు చేయించి అమ్మవారికి అలంకరించారు. మిగిలిన 23 కిలోలను లాకర్లలో భద్రపరిచారు తప్ప ఆభరణాల తయారీపై దేవదాయశాఖ అధికారులు ఆసక్తి చూపడం లేదు. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మూడేళ్ల క్రితం ప్రతిపాదన

మూడేళ్ల క్రితం 13 కిలోల బంగారంతో ఆభరణాలు చేయించాలని అప్పటి ట్రస్ట్ బోర్డు, ప్రజాప్రతినిధులు నిర్ణయించి దేవదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతి కోసం ప్రతిపాదించారు. అయితే ఇప్పటివరకూ ఎలాంటి అనుమతులు లభించలేదు. గతంలో దేవస్థానం సహాయ కమిషనర్లుగా పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు ఉన్నతాధికారులను కలిసి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బంగారం తయారీ విభాగం ద్వారా అమ్మవారికి ఆభరణాలు చేయించాలని సలహా ఇవ్వడంతో సరిపెడుతున్నారు. టీటీడీ ద్వారా ఆభరణాల తయారీకి ఐదేళ్ల సమయం పడుతుందని ఆలయ ఈఓల వద్ద సమాచారం ఉంది. అలాగే తరుగు రూపంలో సుమారు 30 శాతం బంగారం చెల్లించాల్సి వస్తుంది. దేవస్థానంలో తీర్మానం చేసిన వెంటనే ఆభరణాల తయారీకి అనుమతులు వచ్చి ఉంటే ఇప్పటికే మరిన్ని ఆభరణాలు సమకూరేవనే వాదన ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో అడుగు ముందుకు పడటం లేదు.

స్థానికంగా తయారీతో మేలు

గతంలో దేవస్థానం అధికారులు, దేవస్థానం బోర్డు, ప్రజాప్రతినిధులు, పట్టణ పెద్దలతో కమిటీ ఏర్పాటుచేసి 51 కిలోల బంగారంతో దశలవారీగా ఆభరణాలను స్థానికంగానే తయారుచేయించారు. దీంతో తయారీ వేగంగా పూర్తయిందని భక్తులు, దాతలు అభిప్రాయపడుతున్నారు. ఎప్పటికప్పుడు సేకరించిన బంగారంతో ఆభరణాలు తయారుచేయించి అలంకరించడం ద్వారా మరింత మంది దాతలు ముందుకు వస్తారని పలువురు అంటున్నారు. ఏళ్ల తరబడి సేకరించిన బంగారాన్ని లాకర్లతో ఉంచడం వల్ల ప్రయోజనం లేదని అంటున్నారు. దేవదాయశాఖ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

అమ్మవారి భవనం విషయంలోనూ..

భీమవరంలోని ఉండి రోడ్డులో ఆరేళ్ల క్రితం దేవస్థానానికి చెందిన 41 సెంట్ల భూమిలో 18 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో భవనం నిర్మించారు. చదరపు అడుగుకు రూ.12 అద్దె చెల్లించేలా ఓ సంస్థ వేలంలో పాడుకోగా అప్పటి దేవదాయ శాఖ కమిషనర్ వేలాన్ని రద్దు చేయాలని ఈఓపై ఒత్తిడి తీసుకురావడంతో ఒప్పందం నిలిచిపోయింది. దీంతో రెండేళ్లపాటు భవనం ఖాళీగా ఉండటంతో దేవస్థానానికి ఆదాయం రాకపోగా మున్సిపాలిటీకి పన్ను రూపంలో రూ.4 లక్షలు చెల్లించారు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం చదరపు అడుగుకు రూ.9 చొప్పున 11 ఏళ్ల లీజుకు ఓ ఆస్పత్రికి భవనాన్ని అద్దెకిచ్చారు. అద్దె మొత్తాన్ని తగ్గించడంతో నెలకు రూ.54 వేల ఆదాయం నష్టం వస్తోంది. నాటి దేవదాయ శాఖ కమిషనర్, ఇతర ఉన్నత అధికారులు నిర్లక్ష్యంతో ఇప్పటివరకూ సుమారు రూ.19.44 లక్షల ఆదాయాన్ని దేవస్థానం కోల్పోయింది. ఆలయ అభివృద్ధి, అమ్మవారి స్వర్ణమయం విషయంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

రూ.1,76,000 విలువైన నకిలీ రూ.500 నోట్ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

తాడేపల్లిగూడెం అర్బన్: నకిలీ నోట్ల ముఠాను తాడేపల్లిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ డి.విశ్వనాథ్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఓ మద్యం దుకాణం వద్ద నకిలీ రూ.500 నోట్లు మార్చేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించినట్టు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో కొందరు నకిలీ నోట్లను మారుస్తున్నట్టు గుర్తించి విచారణ చేపట్టామన్నారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంటకి చెందిన పులపాక సాంబశివ నకిలీ నోట్లను తయారుచేస్తున్నట్టు తెలిసిందన్నారు. నకిలీ నోట్లను తయారు చేస్తున్న ఇంటిని సోదా చేసి కంప్యూటర్, రెండు ప్రింటర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సాంబశివతో పాటు మరో 8 మంది ముఠాగా ఏర్పడ్డారన్నారు. వెలగదుర్తి జ్యోతి సాయి (కోనసీమ జిల్లా ఆత్రేయపురం), చింత వరప్రసాద్ (కోనసీమ జిల్లా), ఏలూరి వెంకట సత్యనారాయణ (భీమవరం మండలం రాయలం), పూలపల్లి చినబాబు (తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం గోపవరం), కాళీ సుబ్బరాజు (దెందులూరు మండలం కొమిరేపల్లి), బొడ్డు శ్రీధర్ (కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లి), నల్ల ప్రసాద్ (హనుమాన్‌జంక్షన్), వాసంశెట్టి రఘురాం (కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరు) ముఠాగా పలు ప్రాంతాల్లో నోట్లు మారుస్తున్నారని విచారణలో తేలిందన్నారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు. సాంబశివ, సుబ్బరాజును ఉంగుటూరులో, శ్రీధర్, రఘురాంను నూజివీడు రోడ్డులోని ఏపూరులో అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి రూ.1,76,000 విలువైన 352 రూ.500 నకిలీ నోట్లు, కంప్యూటర్, రెండు ప్రింటర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సైలు పి.నాగరాజు, బాదం శ్రీను సిబ్బంది కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించారన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఆర్‌జేసీ నరసింహారావు

ఏలూరు (టూటౌన్): నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో నూరు శాతం పన్ను వసూలు చేయాలని పురపాలక శాఖ రాజమండ్రి రీజనల్ డైరెక్టర్-కం-అప్పిలేట్ కమిషనర్ నాగ నరసింహారావు ఆదేశించారు. స్థానిక గోకుల్ కల్యాణ మండపంలో శుక్రవారం రెవెన్యూ వసూళ్లు, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల వినియోగం, గుంతలు లేని రోడ్లు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏలూరు కమిషనర్ ఎ.భానుప్రతాప్, అడిషనల్ కమిషనర్ జి.చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్లు టి.పావని, కె.వెంకటరమణ, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ చోరీ చేస్తూ చిక్కిన దొంగ



యువకుడిని స్తంభానికి కట్టేసిన స్థానికులు

కామవరపుకోట: స్థానిక కొత్తూరు బస్టాండ్‌లో సెల్‌ఫోన్ దొంగతనం చేస్తుండగా స్థానికులు యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కొత్తూరు గ్రామానికి చెందిన చెడే పవన్, మరికొంతమంది విద్యార్థులు జంగారెడ్డిగూడెం ప్రతిరోజు వెళ్తూ ఉంటారు. శుక్రవారం కొత్తూరు బస్టాండ్‌లో ఎక్కుతుండగా గుర్తు తెలియని యువకుడు పవన్ జేబులోని సెల్‌ఫోన్ లాగే ప్రయత్నం చేశాడు. పవన్ ప్రతిఘటించడంతో ఆ యువకుడు పారిపోయే ప్రయత్నం చేశాడు. స్థానికులు వెంబడించి కొత్తూరు శ్మశాన వాటిక సమీపంలోని జీడిమామిడి తోట వద్ద పట్టుకుని స్తంభానికి కట్టేసి ప్రశ్నించారు. తడికలపూడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై చెన్నారావు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల స్వాధీనం



ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ సిబ్బంది

నూజివీడు: మండలంలో, పట్టణంలోను అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ బీవీ సుబ్బారావు తెలిపారు. మండలంలోని సీతారామపురం, పల్లెర్లమూడిల వద్ద ఉన్న రామిలేరు నుంచి గురువారం అర్ధరాత్రి మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. నూజివీడులోని పెద్ద చెరువు నుంచి మట్టిని శుక్రవారం ట్రాక్టరులో అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కార్యాలయం వద్దకు తరలించారన్నారు.

సారా బట్టీపై దాడులు



చెక్కపల్లిలో సారాబట్టీపై దాడులు

ముసునూరు: నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు ఆధ్వర్యంలో సారా బట్టీపై మెరుపు దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య శుక్రవారం తెలిపారు. ముసునూరు మండలం చెక్కపల్లిలోని ఓ ఆయిల్‌పాం తోటలో రహస్యంగా నాటుసారా తయారు చేస్తున్న తాళం మహేశ్వరరావుకు చెందిన సారా బట్టీపై దాడి చేశారు. దాడిలో 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, సారా తయారీ కోసం ఊరబెట్టిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

పౌల్ట్రీకి కోలుకోలేని దెబ్బ

- రూ.100 కోట్లకు పైగా నష్టమన్న పౌల్ట్రీ ఫెడరేషన్
- వైరస్ కంటే ప్రచారంతోనే ఎక్కువ ముప్పు
- బయో సెక్యూరిటీ లోపమన్న కేంద్ర బృందం
- బయో సెక్యూరిటీ నిబంధనలు పాటిస్తున్నామంటున్న రైతులు



వేల్పూరులో శానిటేషన్‌కు సిద్ధమైన ఆర్ఆర్ టీమ్ బృందం(ఫైల్)



వేల్పూరులో ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న కేంద్ర పశుసంవర్ధక శాఖ జేసీ బాంబల్(ఫైల్)

తణుకు అర్బన్: బర్డ్‌ఫ్లూ వైరస్‌తో రాష్ట్ర వ్యాప్తంగా పౌల్ట్రీ రంగం కుదేలైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని ఫారాల్లో వచ్చిన వైరస్ పౌల్ట్రీ రైతాంగానికి తీరని వ్యథ మిగిల్చింది. దాదాపు రాష్ట్రంలో రూ.100 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. వైరస్‌తో కొన్ని చనిపోగా, మరికొన్ని చంపేయాల్సి రావడం తీరని ఆవేదన మిగిల్చింది. అప్పులు చేసి కోళ్లను పెంచుతున్నామని, ఇప్పుడు బ్యాంకు రుణాలు ఎలా కట్టాలి అంటూ పశుసంవర్ధక శాఖ అధికారుల వద్ద రైతులు ఘొల్లుమన్న తీరు కలచివేసింది. అధికారులు ఏమైనా సాయం అందేలా చూస్తారని ఎదురు చూస్తున్న రైతుల్లో బయోసెక్యూరిటీ పూర్తిస్థాయిలో లేకపోవడం వల్లే కోళ్లకు వైరస్ వచ్చిందని వ్యాఖ్యలు చేయడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ కోళ్ల ఫారాల్లో కొన్ని దశాబ్దాలుగా చేస్తున్నట్లే బయోసెక్యూరిటీ విధానాన్ని పాటిస్తున్నామని.. అయినా అధికారులు బయోసెక్యూరిటీని కారకంగా చూపడంపై గగ్గోలు పెడుతున్నారు.

కేంద్ర బృందానికి వినతి

ఈ నెల 20న తణుకు, బాదంపూడి, కానూరు ప్రాంతాల్లో కేంద్ర పశుసంవర్ధక శాఖ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా తణుకు చిట్టూరి హెరిటేజ్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో సభ్యులు, రైతులు తమ సమస్యలను బృందానికి విన్నవించుకున్నారు. కోళ్లకు వచ్చిన వైరస్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పౌల్ట్రీ రంగం అతలాకుతలమైపోయిందని, వైరస్ కారణంగా చనిపోయిన, కల్లింగ్ చేసిన కోళ్ల కంటే ప్రజల్లోకి ప్రచారం అతిగా వెళ్లడంతో వైరస్ లేని ప్రాంతాల్లో కూడా చికెన్‌ను ముట్టుకోని స్థితికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో కోళ్లు పెంచలేక ఊరకనే ఇచ్చేసే పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.

రెడ్‌జోన్‌లో...

తణుకు మండలం వేల్పూరు గ్రామంలో రెడ్‌జోన్‌గా ప్రకటించిన ప్రాంతంలో 5 కోళ్ల ఫాంలు ఉండగా రెండింటిలో మాత్రమే వైరస్ బయటపడింది. రెండు ఫాంలలో 85 వేల కోళ్ల సామర్థ్యం ఉండగా 49 వేల కోళ్లు వైరస్ బారిన పడి మృతిచెందగా, మరొక 21,907 కోళ్లను ఖననం చేశారు. రెడ్ జోన్ పరిధిలో పూర్తిస్థాయిలో శానిటేషన్ ప్రక్రియ పూర్తిచేసి మూడు నెలలపాటు ఆయా ఫారాలపై నిషేధాజ్ఞలు విధించారు. ఇకపై కోళ్ల ఫారాల్లో బయోసెక్యూరిటీ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలయ్యేలా పశుసంవర్ధక శాఖ అధికారుల పూర్తి పర్యవేక్షణ ఉంటుందని, 50 వేల కోళ్ల సామర్థ్యం ఉన్న ఫారాల్లో నిబంధనల ప్రకారం పశుసంవర్ధక శాఖ వైద్యుల అనుమతులు తప్పనిసరని చెబుతున్నారు.

బయో సెక్యూరిటీతో సోకని వైరస్

ఉంగుటూరు : బయో సెక్యూరిటీ పాటిస్తే బర్డ్‌ఫ్లూ సోకే ప్రమాదం తప్పుతుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 300 కోళ్లఫారాలలో కోళ్లు పెంచుతుంటే కేవలం 25 లోపు ఫారాల్లో బర్డ్‌ఫ్లూ సోకింది. మిగిలిన 275 ఫారాలలో కోళ్లు ఆరోగ్యకరంగా ఉండడానికి కారణం.. బయో సెక్యూరిటీ అమలు చేయడం వల్లే. వలస పక్షులు ఫారాలలోకి ప్రవేశించడం వల్ల బర్డ్‌ఫ్లూ సోకడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఉంగుటూరు మండలం బాదంపూడిలో ఓ కోళ్ల ఫారంలో సుమారు రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడగా.. సమీపంలోనే ఇతర ఫారాలలో కోళ్లు ఆరోగ్యంగా ఉన్నాయి.

బయో సెక్యూరిటీ అంటే..

- కోళ్ల ఫారాల్లోకి ప్రవేశించే మనుషులు, వాహనాలకు డిస్ ఇన్‌ఫెక్షన్ రసాయనాన్ని తప్పనిసరిగా స్ప్రే చేయాలి.
- కోళ్ల ఫారాల్లోకి కొంగలు, వలస పక్షులు, ఇతర పక్షులు ప్రవేశించకుండా జాగ్రత్తలు పాటించాలి.
- కోళ్ల ఫారాలు, కోళ్ల పెంట ప్రాంతాల్లోకి పక్షులు రాకుండా లింక్ మెస్‌లు ఏర్పాటు చేయాలి.
- కోళ్ల ఫారాల్లోకి ఇతరులను అనుమతించకూడదు.
- ఒక కోళ్ల ఫారంలోకి ప్రవేశించిన వారిని మరొక కోళ్ల ఫారంలోనికి అనుమతించరాదు.
- ఫారాల ఆవరణలో పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో నిర్వహించాలి.
- కోళ్ల పరిశ్రమలో పనిచేసే కార్మికులు మాత్రమే కోళ్ల దగ్గరకు వెళ్ళాలి. సందర్శకులను రానీయకూడదు.

బయో సెక్యూరిటీతో చెక్ పెట్టొచ్చు

బయో సెక్యూరిటీ పాటిస్తే బర్డ్‌ఫ్లూ రాకుండా నివారించవచ్చు. వ్యాధి నిరోధక శక్తి కోడిలో తగ్గనీయకుండా చర్యలు తీసుకోవాలి. క్వాలిటీ ఫుడ్ పెట్టాలి. కోళ్లకు కూడా మినరల్ వాటర్ అందించాలి. బయో నిబంధనలు పాటిస్తే వ్యాధులను అడ్డుకోవచ్చు.

– డా.వల్లూరి సందీప్, పశు వైద్యాధికారి

ఇసుక మేటలు స్వాహా



యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంలో గోదావరి ఒడ్డున తవ్వేసిన లంక మట్టి

యలమంచిలి: మండలంలోని అబ్బిరాజుపాలెంలో మట్టి మాఫియా ఇసుక మేటలను కొల్లగొట్టి సొమ్ములు చేసుకుంటుంది. గోదావరి ఒడ్డున ఇసుక మేటలు తవ్వడం పర్యావరణానికి చేటని తెలిసినా మాఫియా ముఠా పట్టించుకోకుండా తవ్వకాలు చేపడుతుంది. గ్రామంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల కింద బేస్ సరిచేయడానికి పగలు ఇసుక మేటలు తవ్వుతుండగా, గ్రామంలో కొందరు ఇళ్లు నిర్మించుకుంటూ బేస్‌మెంట్‌లోకి ఈ ఇసుక తీసుకెళ్తున్నారు. ఇదే అదనుగా బయట అమ్మకాలకు రాత్రి సమయంలో బొండు ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. లక్షలాది రూపాయిలు చేతులు మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వెనుక అధికార పార్టీ నాయకుల ఒత్తిడి ఉందని తెలుస్తుంది. ఒక పక్క ఏటిగట్టు పటిష్ట పనులు చేపడుతూ మరో పక్క ఏటిగట్టు లోపల పర్యావరణానికి ముప్పు కలిగించే అనర్థాలు చేయడం ఎంత వరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు



భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం : చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య చెప్పారు. భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. మెంటేవారితోటకు చెందిన రేవు ఆంజనేయస్వామి ఇంట్లో చోరీ జరగగా.. సుమారు రూ.1.18 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.8 వేల నగదు మాయమయ్యాయి. అతను పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 20న సాయంత్రం నిందితులు తణుకు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన ఎస్.ఈశ్వరరావు, తణుకు మండలం పాతూరు గ్రామానికి చెందిన తండాసి కామేశ్వరరావును మెంటేవారితోటలోని బైపాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ జయసూర్య చెప్పారు. విచారించగా భీమవరంలో దొంగతనంతోపాటు తాడేపల్లిగూడెం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1.35 లక్షల బంగారు ఆభరణాలు, రూ.45 వేలు విలువచేసే వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పెనుగొండలో 49 కాసుల బంగారం చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీవేద

పెనుగొండ: ఇంటికి తాళం వేసి షిర్డీ వెళ్తే.. తిరిగి వచ్చే సరికి దొంగలు ఉన్నదంతా దోచేశారు. 49 కాసుల బంగారు ఆభరణాలు అపహరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనుక ఉంటున్న గుబ్బల లక్ష్మీనారాయణ ఈ నెల 17న షిర్డీ వెళ్లారు. శుక్రవారం ఇంటికి చేరుకునే సరికి బీరువా బద్దలు కొట్టి ఉండడంతో హడలిపోయారు. బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పెనుగొండ ఎస్సై కే గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. 49 కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. నర్సాపురం డీఎస్పీ జీ శ్రీవేద చోరీ జరిగన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంటికి తాళం వేసి దూర ప్రాంతానికి వెళ్లినపుడు పోలీసులకు సమాచారం అందించి, జాగ్రత్తలు తీసుకోవాలని పదే పదే సమాచారం అందిస్తున్నా ప్రజలు మాత్రం బేఖాతరు చేస్తున్నారు.

ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి



మృతుడు పరమేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భీమడోలు : భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం కాంట్రాక్ట్ ఉద్యోగి తల్లిబోయిన పరమేశ్వరరావు(33) శుక్రవారం మధ్యాహ్నం ఆస్పత్రిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రక్త పరీక్ష కేంద్రం వద్ద విధి నిర్వహణలో ఉన్న అతను పాత ఓపీ బ్లాక్ వద్ద మృతిచెందడాన్ని సిబ్బంది ఆలస్యంగా గుర్తించారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుండుగొలనుకు చెందిన పరమేశ్వరరావు మధుమేహంతో చిన్నతనం నుంచి బాధపడుతున్నాడు. రోజులానే ఆసుపత్రికి వచ్చి మధ్యాహ్నం భోజనం చేసేందుకు పాత ఓపీ బ్లాక్ వద్దకు వెళ్లాడు. భోజనం చేయకుండానే అక్కడ విగత జీవిగా పడి ఉన్నాడు. కొడుకు సాయంత్రం 5.30 గంటలకు కూడా రాలేదని తండ్రి వెంకట్రావు, ఆసుపత్రికి ఫోన్ చేశారు. దీనితో సిబ్బంది ఆసుపత్రిలోని బ్లాక్‌లను పరిశీలించగా పాత ఓపీ బ్లాక్ వద్ద పడి ఉండడాన్ని చూసి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పరమేశ్వరరావు ముక్కు నుంచి రక్తం కారడాన్ని గుర్తించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

యలమంచిలి: తన భర్త, అతని కుటుంబసభ్యులు అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన పిల్లా సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్రిడి గుర్రయ్య తెలిపారు. పిల్లా సంధ్యకు అడవిపాలెం గ్రామానికి చెందిన శివ ప్రసాద్‌తో 2016లో వివాహమైంది. పెళ్లయిన తరువాత నుంచి ప్రసాద్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం తేవాలని వేధిస్తుండడంతో తట్టుకోలేక ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

నగల చోరీపై విచారణ

ముదినేపల్లి రూరల్: వివాహానికి హాజరైన బంధువుల నగల చోరీపై పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వడాలిలో కె.ప్రసాద్ ఇంటి వద్ద జరిగిన వివాహానికి రాజమండ్రి నుంచి వచ్చిన నంబూరి బుజ్జి దంపతులు ఈ నెల 16న హాజరయ్యారు. వీరి వెంట సుమారు రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తీసుకువచ్చి వాటిని బ్యాగులో ఉంచి పెళ్లి వారి బంధువుల ఇంటి వద్ద నిద్రపోయారు. తెల్లవారేసరికి బంగారు ఆభరణాలు కన్పించలేదు. బంధువులను విచారించినప్పటికి ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ ఎస్సై వీరభద్రరావుతో కలిసి పెళ్లి కుమారుడి ఇంటి వద్ద గురువారం బంధువులను విచారించి వివరాలు సేకరించారు.



కల్వర్టుల వద్ద భయం భయం

- రోడ్డుకు ఎత్తుగా లేదా పల్లంగా ఉండడంతో ప్రమాదాలు
- డ్రైయిన్‌లోకి పడి ఉన్న బల్లలు
- ఊచలు బయటకు వచ్చిన వైనం
- రాకపోకలకు ఇబ్బందులు
- డ్రైయిన్లలో పారని మురుగు


పాతూరు 12వ వార్డు వేప చెట్టు వద్ద కల్వర్టు ఇలా..


శేషమహల్ రోడ్డులో ప్రమాదకరంగా కల్వర్టు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆయా వార్డుల్లో రోడ్ల మధ్య ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. సీసీ డ్రెయిన్లపై వేసిన సిమెంట్ బల్లల మధ్య ఖాళీలు ఏర్పడడం, డ్రెయిన్‌లోకి పడిపోవడం, ఇనుప ఊసలు బయటకు కనపడడంతో రాకపోకలకు ప్రజలు హడలిపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో రాత్రి సమయంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. రోడ్లకు ఎత్తుగా లేదా పల్లంగా కల్వర్టు బల్లలు ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో రాకపోకల సమయంలో ద్విచక్ర వాహనాల టైర్లకు పంక్చర్లు పడుతున్నాయి. కల్వర్టు వద్ద గోతులను గుర్తించేలోపే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

దుర్గంధం

రోడ్ల మధ్యలో ఉన్న కల్వర్టులు శిథిలం కావడం, సిమెంట్ బల్లలు డ్రెయిన్‌లోకి పడిపోవడం, సిల్టు పేరుకుపోవడంతో మురుగునీరు ముందుకు పారడంలేదు. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రి సమయంలో దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కల్వర్టుల దుస్థితి ఇలా..

పట్టణంలో కల్వర్టు ప్రాంతాలన్నీ ప్రమాదకరంగా మారాయి. మరీ ప్రమాదకరంగా మారిన కల్వర్టుల్లో ప్రధానంగా.. పాతూరు 12వ వార్డులో వేప చెట్టు పక్క వీధిలో కల్వర్టు ఎత్తు చేయాల్సుంది.

- చిన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద కల్వర్టులకు ఖాళీలు ఏర్పడ్డాయి. అక్కడ నుంచి ఎన్‌టీఆర్ జంక్షన్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టు ఊచలు పైకి కనిపిస్తున్నాయి.
- ఆర్టీసీ డిపోకు ఎదురుగా వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో కల్వర్టుపై రాళ్ల మధ్య ఖాళీలు ఏర్పడ్డాయి.
- నందిబొమ్మ సెంటర్‌కు వెళ్లే మార్గంలో డ్రెయిన్‌పై ఉన్న రాళ్ల మధ్య ఖాళీలు ఏర్పడ్డాయి. కొన్ని రాళ్లు డ్రెయిన్‌లో పడి ఉన్నాయి.

గాయాల పాలవుతున్నాం



ఎత్తు పల్లాలుగా ఉన్న కల్వర్టుల కారణంగా వాహనచోదకులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లకు సమాంతరంగా కల్వర్టులను శాశ్వత ప్రాతిపదికన, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మించాలి. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తక్షణం చర్యలు తీసుకోవాలి.

– ఎ.వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం


వెంకటేశ్వరస్వామి గుడి వద్ద కల్వర్టు


చిన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఇలా..


నందిబొమ్మ సెంటర్ ప్రారంభంలో డ్రెయిన్‌లో పడి ఉన్న బల్లలు

క్లుప్తంగా

ఇంటర్మీడియట్ విద్యార్థినికి మానవత సాయం


ఆర్థికసాయం అందిస్తున్న మానవత ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రగతి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని తమ్మినేని నవ్యశ్రీ సాయి తేజస్వినికి ఫీజు, ఆరోగ్య అవసరాల కోసం రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఆర్థికసాయాన్ని అందించినట్లు కెరీర్ గైడెన్స్ చైర్మన్ కోదూరి రాధా పుష్పవతి, జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బొల్లం రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీ, డాక్టర్ కె.రామలక్ష్మి, వి. పార్వతి, ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు


బలుసులమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసు లమ్మవారికి శుక్రవారం సందర్భంగా ఉదయం విశేష పూజలు చేశారు. భక్తులకు ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అమ్మవారికి సాయంత్రం అమ్మవారికి ఊయ్యాల ఉత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదానానికి తాతా శ్రీనివాసరావు, కళ్యాణ్ చక్రవర్తి, మురళీకృష్ణ, రామ లక్ష్మణ, విజయ్ కుమార్, కేశవరావు, సూర్యారావు, రవి కుమార్, బాలాజీ, మహేష్ సహకరించారు.

నేటి నుంచి జోనల్ క్రీడా పోటీలు

పెంటపాడు: ఈనెల 22 నుంచి 25 వరకు ప్రభుత్వ పాఠశాలల తాడేపల్లిగూడెం జోనల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు టీవీ రామకృష్ణ, ఎం శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు తప్పక పాల్గొనాలని కోరారు.

24 నుంచి స్పోర్ట్స్ మీట్

పెంటపాడు: తాడేపల్లిగూడెం ఏఎస్ఆర్ హోమియో కళాశాలలో ఈనెల 24 నుంచి 26 వరకు అంతర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఉప్పలపాటి ప్రసాద్ తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పరిధిలోని అయుష్, హోమియో, ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. 24న ఉదయం 9 గంటలకు ప్రారంభ కార్యక్రమానికి ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ నరసింహం, ఏఎస్ఆర్ సంస్థల చైర్మన్ ఆకుల విజయవర్ధన్, స్పోర్ట్ బోర్డ్ కార్యదర్శి ఇ.త్రిమూర్తి, ట్రినిటీ ఆసుపత్రి డైరెక్టర్ విజయ్ సృజిత్ హాజరవుతారని తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి


కాగులంపాడులో పోషకాహారం అందిస్తున్న దృశ్యం

పెంటపాడు: చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు పూర్తి బాధ్యత వహించాలని ముదునూరు పీహెచ్‌సీ డాక్టర్ పూజిత పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో ఫ్యామిలీ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఆమె కాగులంపాడు అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలో చిన్నారులు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు పోషణకాహారం అందించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గాభవాని, వర్కర్ దుర్గా భవాని, సబ్‌సెంటర్ సీహెచ్ఓ రేవతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోకో తోట పరిశీలన


చక్రదేవరపల్లిలో కోకో తోటను పరిశీలిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: చక్రదేవరపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉద్యానశాఖఅధికారి ఎస్.రామ్మోహన్, ఐఐఓపీఆర్ రిటైర్డ్ శాస్త్రవేత్త కాళిదాసులు గ్రామానికి చెందిన తమ్మారావు కొబ్బరి, కోకో తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి, కాయ కోతలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు అందించారు. క్యాడ్బరీ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర, చక్రదేవరపల్లి గ్రామ రైతులు, కోకో రైతులు పాల్గొన్నారు.

24న ధర్నాను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న భవన నిర్మాణ సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ కోరుతూ ఫిబ్రవరి 24న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యనిర్వాహణ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం సిపాయి పేట సంఘ కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షుడు గంధం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డులో దరఖాస్తులన్నీ పెండింగ్‌లో ఉండడంతో కార్మికులు నిరాశ చెందుతున్నారని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ ఎన్నికలలో కార్మిక వర్గానికి ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డులోని వివిధ సంక్షేమాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణలు మాట్లాడుతూ కార్మికుల అసంతృప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిర్వహించే ధర్నాను విజయవతం చేయాలని కోరారు. కోడే సాయి బాలాజీ, పాలూరి సుబ్రహ్మణ్యం, కంకిపాటి రాజు, మంచాల ఏసు, తొంటా నాగరాజు, శీలిరాజు, కోట దుర్గా ప్రసాద్, ఎం పోతురాజు, పోసిబాబు, గోపి రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. అతని వద్ద నుంచి ఎనిమిది డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

దోమ పుట్టుకను నివారించాలి


తణుకులో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్ : దోమ పుట్టుకను నివారించగలిగితే వ్యాధులను నిరోధించవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు డీఎల్‌కే రోడ్డు, సొసైటీ రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. దోమ పుట్టుకకు రెండు కారణాలుగా కనిపిస్తున్నాయని, ఇళ్ల ఆవరణల్లో నిరుపయోగ సామగ్రిలో వారం రోజుల పైబడి ఉన్న కదలిక లేని నీటినిల్వలు, డ్రెయినేజీల్లో చెత్త, చెదారాలను వేయడం వల్ల మురుగునీరు పారుదలకు ఆటంకం కలగడం అని అన్నారు. ఇంటి ఆవరణ, పరిసరాలను పరిశుభ్రతగా ఉంచి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, దోమల నియంత్రణ అందరి బాధ్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీలు కె.మార్తమ్మ, కె.వెంకటలక్ష్మి, ఆశ కార్యకర్తలు ఎం.కుమారి, వై.సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.


కుండీలలో నిల్వ నీటిని తొలగిస్తున్న హెల్త్ సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటక జనిత ప్రదేశాలను నిలువరించేందుకు, దోమలు పెరగకుండా ఉండేందుకు తప్పనిసరిగా ప్రతి శుక్రవారం పరిసరాల పరిశుభ్రత పాటించాలని స్థానిక సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు ప్రజలను కోరారు. పట్టణంలోని వీకర్స్‌కాలనీ, కడకట్ల ఆరోగ్య కేంద్రాల పరిధిలో శుక్రవారం 2, 3, 4, 33 వార్డుల్లో ఫ్రై డే, డ్రై డే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, వార్డు సందర్శనాలు, ర్యాలీలు, ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిల్వ నీటిని హెల్త్ సిబ్బంది తొలగించారు. ఆ ప్రాంత వాసులకు నిల్వ నీటిలోని లార్వాలను చూపించారు. ఆరోగ్య కార్యదర్శి జయమేరీ, కెంపురత్నం, మంగతయారు, సరళ, సౌజన్య, అంగన్‌వాడీలు దుర్గ పార్వతి, శ్రీలక్ష్మి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు దుర్గా, కోమలి, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే ఎస్సీలకు రాజ్యాధికారం


మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీలు ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చునని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటి మల్లి మంగరాజు పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడారు. బీజేపీకి మద్దతు ఇచ్చిన మంద కృష్ణ మాదిగకు అనుకూలంగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేస్తానని చెప్పిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణ మాదిగ కేంద్రంలో ఉన్న మనువాద పార్టీలతో చేతులు కలిపి, అంబేద్కర్ వారసులైన మాలలను, మనువాదులుగా, సైకోలుగా, సంపన్నులుగా అభివర్ణిస్తు మాట్లాడడాన్ని తప్పుపట్టారు. ఎస్సీల మధ్య చీలిక తెచ్చి లబ్ధి పొందాలని కూటమి ప్రభుత్వాలకు ఉందన్నారు. విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించాలని, సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుంకర సీతారాం, మానుకొండ శ్రీను బాబు, కోట రత్నరాజు తదితరులు హాజరైయారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



తాడేపల్లిగూడెం (టీఓసీ) : ధర్నా చేస్తున్న ఉద్యోగులు


తణుకు: నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వివిధ యూనియన్ల నాయకులు కోరారు. స్థానిక ఎస్‌బీఐ ఈ కార్నర్ వద్ద శుక్రవారం సాయంత్రం ఉద్యోగులు ధర్నా చేశారు. పట్టణంలోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు. బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, బ్యాంకు పెన్షనర్లు పెన్షన్ రివిజన్‌ని చేపట్టాలని, 12వ వేతనం ఒప్పందం మేరకు ఐదు రోజుల బ్యాంక్ ఉద్యోగుల పని దినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ కన్వీనర్ ఎస్ఎస్ ప్రసాద్, అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ సమితి సభ్యులు పీవీ సూర్యనారాయణ, స్టేట్ బ్యాంక్ అధికారుల సమాఖ్య నాయకులు జోనల్ కార్యదర్శి డి.జోహార్ లాల్, దళిక శ్రీనివాస్, ఎం కిరణ్, పవన్ కుమార్, సీతాళం నారాయణ మూర్తి, ఏడుకొండలు, దివ్య రజని, ఎల్.గాంధి, పాలూరి సత్యనారాయణ, చైతన్య, దుర్గా ప్రసాద్, పి.కార్తీక్ తదితరులు నేతృత్వం వహించారు.

తణుకులో..

తణుకు అర్బన్: బ్యాంకు ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తణుకు కెనరా బ్యాంకు ఆవరణలో నిరసన తెలిపారు. వివిధ బ్యాంకులకు సంబంధించి అన్ని క్యాడర్‌లకు సంబంధించిన ఉద్యోగులను నియమించాలని, టెంపరరీ స్టాఫ్‌ను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వారానికి ఐదు పని దినాల విధానాన్ని అమలు చేయాలని, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీస్ ఆదేశాలు బ్యాంకు సిబ్బందికి వ్యతిరేకంగా ఉన్నాయని వాటిని తొలగించాలని, బ్యాంకు సిబ్బందిపై జరిగే దాడులను అరికట్టాలని, ఉద్యోగుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని, ఐబీఏ వద్ద అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులు డి.ప్రసాద్, పి.వీరభద్రరావు, చరణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలి


పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అప్పారావు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని నవాబుపాలెం, కృష్ణాయపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు నూరు శాతం పనులు కల్పించాలన్నారు. తొలుత మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని, ఉప సర్పంచ్ బేతపూడి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.వెంకటేష్, ఇన్‌చార్జి ఏపీడీ కేవీవీఎస్ ప్రసాద్, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం వెంకటేష్ అన్నారు. నవాబుపాలెం, కృష్ణాయపాలెం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాన్ని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు హరికిషోర్, ఎండీ అహ్మద్, ఎంఆర్‌సీ రవికిరణ్, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యఘర్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలి


పోడూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్

పోడూరు: 'సూర్యఘర్ యోజన' పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ పిలుపునిచ్చారు. పోడూరు సచివాలయంలో పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహావసర విద్యుత్ వినియోగం కోసం సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయన్నారు. ఎలక్ట్రికల్ ఏడీ సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను 70 శాతం వరకు తగ్గించుకోవచ్చని తెలిపారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు కోసం 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ వస్తుందన్నారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకోసం 2 కిలోవాట్లకు రూ.1.70 లక్షలు, 3 కిలోవాట్లకు రూ.2.30 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులు తమ గ్రామంలోని ఎలక్ట్రికల్ లైన్‌మెన్‌ను గానీ, పోడూరు సబ్‌స్టేషన్‌లో గాని సంప్రదించాలని సూచించారు.

నరసింహారెడ్డి పోరాట పటిమను భావితరాలకు అందించాలి

పెనుమంట్ర: భారతదేశ ప్రథమ స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట పటిమను, జీవిత చరిత్రను బావిపౌరులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వేణుగోపాల రెడ్డి అన్నారు. శుక్రవారం మార్టేరు పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం భవనంలో జిల్లా రెడ్డి సంఘం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, మార్టేరు ఎంపీటీసీ సభ్యుడు గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ శనివారం తణుకు రెడ్డి జన సంఘ భవనంలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న178వ వర్ధంతి సభలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. పంచ గ్రామ రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు కేకేఆర్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నాయకులు తాడి భీమారెడ్డి, మేడపాటి విజయ రెడ్డి, చింత ధర్మవీర నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మాతృభాష ప్రాధాన్యతను గుర్తించండి


నన్నయ్య ప్రాంగణంలో మాట్లాడుతున్న విద్యార్థిని


తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో..


మాట్లాడుతున్నహెచ్‌ఎం ఏడుకొండలు

తాడేపల్లిగూడెం : మాతృభాషా ప్రాధాన్యతను గుర్తించాలని స్థానిక నన్నయ్య ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో సామాజిక ఐక్యతను పెంపొందించడంలో మాతృభాష ప్రాముఖ్యత ఎంతో ఉందని వివరించారు. మాతృభాష విశిష్టతను వక్తలు వివరించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): రామారావుపేటలో శుక్రవారం సాయంత్రం తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షుడు మండా బ్రహ్మాజీ అధ్యక్షతన సభ నిర్వహించారు. ముఖ్య అతిథి కొట్టే కోటారావు మాతృభాష ఉన్నతికి కృషి చేయాలన్నారు. వ్యాసరచన పోటీలలో విజేతకలు బహుమతులు అందజేశారు. ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాసరావు, డాక్టర్ మాడభూషి జ్యోతి కుమారి, పీటీ వెంకన్న, యద్దనపూడి సుబ్బారావు, మండవల్లి చెన్న నాగేంద్ర, సుంకర శ్రీనివాస్, మహాశివభట్టు లక్ష్మణరావు, గోదావరి ప్రభాకర్ శాస్త్రి, యర్రగోగుల దుర్గా ప్రసాద్, కూచి అనిల్ కుమార్, చినుకు జనార్ధనరావు, సాహితీ సభ్యులు హాజరైయారు.

భవిత కేంద్రంలో..

సుబ్బారావుపేట భవిత కేంద్రంలో డైమండ్స్ క్లబ్ జిల్లా లీడర్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో విద్యార్థులకు తెలుగు పుస్తకాలు, ఆట వస్తువులు, మిఠాయిలు అందజేశారు. మాతృభాష తల్లితో సమానమని, ఎన్ని భాషలు ఉన్నా మాతృభాష వెలకట్టలేమని, భాషను, ఉనికిని కాపాడుకుందామని పేరిచర్ల అన్నారు. భవిత విద్యార్థిని కూచి మణిశ్వని తెలుగు తల్లి వేష ధారణలో ఆకట్టుకుంది. హెచ్‌ఎం బి.జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తణుకులో..

తణుకు అర్బన్: మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష తల్లి ఒడే బిడ్డకు తొలిబడి అని పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ మాటే మాతృభాష అని, ప్రతి విద్యార్థీ అమ్మలాంటి మాతృభాష గౌరవం పెంచేలా కృషిచేయాలని సూచించారు. సమాజంలో మన మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదని వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మి, ఏసుకృప, రామకృష్ణ, స్వరూపరాణి, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనార్థం గ్రామసభలు


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు: రైతులకు ఆమోదయోగ్యమైన భూముల రీ సర్వే చేపట్టేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నాదమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో శుక్రవారం భూముల రీ సర్వేలో లోటుపాట్లను తెలుసుకునేందుకు గ్రామస్తులతో ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో పాటు కలెక్టర్ కూడా నేల మీద బరకంపై కూర్చుని గ్రామసభను నిర్వహించి రైతుల నుంచ సమస్యలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రైతులతో మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలు లేకుండా చక్కటి పరిష్కార మార్గాన్ని అందించేందుకే రీ సర్వేను చేపట్టామన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి అపోహలకు తావులేని వాస్తవ రికార్డులను రూపొందించడమే లక్ష్యమన్నారు. ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి తొలుత రీ సర్వేను ప్రారంభించారన్నారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలో గత 15 రోజులుగా రీ సర్వే నిర్వహిస్తున్నారని వాస్తవ భూమి లెక్కలు నిర్ధారించుకున్న అనంతరం వ్యక్తిగతంగా భూముల కొలతలను రైతుల సమక్షంలోనే నిర్వహిస్తామన్నారు. అలాగే రీ-సర్వేలో ఉత్పన్నమయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ప్రతి మండలానికి ఒక రీసర్వే డీటీని నియమించామన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 20 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. మొత్తం 37 వేల ఎకరాలను సర్వే చేయవలసి ఉండగా, ఇప్పటి వరకు 22 వేల ఎకరాలు సర్వే పూర్తి చేశారన్నారు.